క్లుప్తంగా

ప్రణాళికతో చదవాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): పరీక్షలు సమీపిస్తుండటంతో ప్రణాళికతో చదివి ఎక్కువ మార్కులు సాధించాలని ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ విజయజ్యోతి పదవ తరగతి విద్యార్థినులకు సూచించారు. శనివారం ఆమె జీసీడీఓ కె.సునీతతో కలిసి వెల్దుర్తి కేజీబీవీని తనిఖీ చేశారు. రికార్డులను, హాజరును, 8వ తరగతి విద్యార్థినులకు ఇచ్చిన ట్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థినులతో సమావేశమై ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధమయ్యేలా అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులతో సమావేశమై వందశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఇన్‌చార్జ్ ఎస్ఓ భాగ్యమ్మ పాల్గొన్నారు.

ఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



ఎమ్మిగనూరు టౌన్: ఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు బి.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 20 ఏళ్లుగా మండల, జిల్లా కమిటీలో చేసిన సేవలను గుర్తించి ఇటీవల భీమవరంలో జరిగిన యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారని బి.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు.

27 నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

తుగ్గలి: మండల పరిధిలోని బొందిమడుగులలో ఈనెల 27నుంచి 29 వరకు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శనివారం గ్రామస్తులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మల్లికార్జునస్వామి ఆలయంలో గణపతి, పార్వతీదేవి, సుబ్రమణ్యేశ్వర, నందీశ్వర, నాగదేవత, సుంకులా పరమేశ్వరీ, నాభిశిల, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని దేవబెట్ట – కోటేకల్ బస్టాప్ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ యువకుడిపై దాడి చేసి, అతని బైక్‌కు నిప్పంటించారు. బాధితుడు తెలిపిన వివరాలు.. పెద్దకడబూరు మండలం హనుమాపురం గ్రామానికి చెందిన బోయ ఈరన్న శుక్రవారం రాత్రి శుభకార్యం నిమిత్తం దేవబెట్ట గ్రామానికి చేరుకున్నాడు. రాత్రి కార్యక్రమం ముగించుకుని శనివారం తెల్లవారుజామునే బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో గుర్తు తెలియని దుండగులు అడ్డుగా వచ్చి దాడి చేశారు. వారి నుంచి తప్పించుకొని బైక్ వదిలి యువకుడు పారిపోగా.. దుండగులు బైక్‌పై పెట్రోల్ వేసి నిప్పంటించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారిస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న సుభాష్ చంద్రబోస్

నందవరం: గ్రంథాలయాలను విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సుభాష్ చంద్రబోస్ సూచించారు. శనివారం స్థానిక గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయాన మాట్లాడుతూ..పాఠకుల సౌకర్యార్థం నిబంధల ప్రకారం గ్రంథాలయాన్ని తప్పని సరిగా తెరిచి ఉంచాలని గ్రంథాలయాధికారి శివరామ్‌ప్రసాద్‌కు సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



గ్రామంలో పర్యటిస్తున్న బి.విరూపాక్షి

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త బి.విరుపాక్షి సూచించారు. శనివారం లక్కందిన్నె, కరివేముల, ఐరన్‌బండ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. టీడీపీ హయాంలో గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. జగనన్న పాలనలో సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ సురేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు లుముంబా, ప్రేమనాథ్‌రెడ్డి, నిజాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో చెడిపోయిన బోరుకు సర్పంచ్ గాదిలింగప్ప శనివారం మరమ్మతులు చేయించారు. వేసవి సమీపిస్తుండటంతో ప్రజలకు నీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్త చర్యగా బోరుకు మరమ్మతులు చేయించినట్లు ఆయన తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత ‘వెలుగులు’

- 200 యూనిట్ల వరకు విద్యుత్ రాయితీ ఇస్తున్న ప్రభుత్వం
- నాలుగేళ్లలో ఎస్సీలకు రూ. 6.55 కోట్ల లబ్ధి
- ఎస్టీలకు చేకూరిన లబ్ధి రూ.5.58 లక్షలు
- టీడీపీ హయాంలో నామ మాత్రంగా రాయితీ
- ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో 9,438 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు



ఆలూరు విద్యుత్ సబ్ స్టేషన్

ఆలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీల ఇళ్లలో విద్యుత్ వెలుగులు వెదజల్లుతున్నాయి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కోరి అనేక పథకాలను ప్రవేశ పెట్టింది. అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారులకే ప్రభుత్వ ఫలాలు అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీల ఇళ్లలో విద్యుత్ కాంతులు నింపాలనే ఉద్దేశంతో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నారు. నాలుగున్నరేళ్లకు పైగా ఈ వర్గాలకు ప్రభుత్వ రూ.కోట్లలో రాయితీ ఇచ్చింది.

200 యూనిట్లలోపు ఉచితం

నియోజకవర్గంలో 75 శాతం మంది ఎస్సీ, ఎస్టీలు నిరుపేదలే. నెలకు 200 లోపు విద్యుత్ వినియోగించే ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ ఇస్తోంది. గతంలో కొంత మందికి విద్యుత్ సౌకర్యం ఉండేది కాదు. బిల్లులు చెల్లించే స్తోమత లేక విద్యుత్ కనెక్షన్ తీసుకునేవారు కాదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఉచిత విద్యుత్‌తో పాటు కనెక్షన్ జారీలోనూ రాయితీ అమలు చేస్తోంది. నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికి బిల్లులు రద్దు చేసింది.

టీడీపీ హయాంలో గొప్పలు

గత టీడీపీ హయాంలో కేవలం 100 యూనిట్లు మాత్రమే రాయితీ ఇచ్చేవారు. ఈ మాత్రం దానికే ఎస్సీ, ఎస్టీలకు మేలు చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకునేవారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాయితీని 200 యూనిట్లకు పెంచింది. ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో ఈ నాలుగున్నరేళ్లలో ఎస్సీలకు రూ.6.55 కోట్లు, ఎస్టీలకు రూ.50.58 లక్షల రాయితీ చేకూరింది.

సంబంధిత విద్యుత్ సంస్థకు ఆ బిల్లులను ప్రభుత్వం జమ చేస్తోంది

2019 నుంచి ఆలూరు సబ్ డివిజన్‌లో ఎస్సీలు పొందిన లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	రాయితీ (రూ.కోట్లలో)
2019-20	8,315	1.18
2020-21	8,403	1.48
2021-22	8,660	1.73
2022-23	8,802	2.15

2019 నుంచి ఆలూరు సబ్ డివిజన్‌లో ఎస్టీలు పొందిన లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	రాయితీ (రూ.లక్షల్లో)
2019-20	596	8.32
2020-21	601	12.17
2021-22	617	13.68
2022-23	636	16.81

రుణపడి ఉంటాం



టీడీపీ హయాంలో విద్యుత్ బిల్లు నెలకు రూ.250 నుంచి రూ.300 వరకు వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత 200 యూనిట్లలోపు వాడిన వారికి ఉచిత విద్యుత్ వర్తింపజేశారు. మా సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– జయరామప్ప, ఇందిరా నగర్, ఆలూరు

నాలుగేళ్లలో పైసా చెల్లించలేదు



వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచి నేటి వరకు కరెంటు బిల్లుకు పైసా కూడా చెల్లించలేదు. 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ వాడుకుంటున్నాం. అలాగే కొత్త కనెక్షన్ కోరిన వెంటనే క్యాస్ట్ సర్టిఫికెట్ సమర్పిస్తే రాయితీతో కనెక్షన్ ఇస్తున్నారు. నాలుగేళ్లలో కరెంటు బిల్లు పైసా కూడా చెల్లించలేదు.

– నాగరాజు నాయక్, అరికెర తండా

ప్రభుత్వమే చెల్లిస్తోంది



రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఉచిత విద్యుత్ పథకం ఆయా వర్గాల వారికి ఎంతగానో మేలు చేకూరుస్తోంది. వారు వినియోగించే విద్యుత్ ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది.

– నాగేంద్ర, డీఈఈ, ఆలూరు

మోటారు ఏర్పాటు

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో తాగు నీటి మోటార్ మరమ్మతులకు గురి కావడంతో రెండు రోజులు గ్రామంలో నీటి సమస్య తలెత్తింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి సురేంద్ర శనివారం నూతన మోటార్ బిగించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు.

గిరక బండి విజేత గుడికల్

ఆస్పరి: మండలంలోని అట్టికల్లులో దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి గిరక బండి పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. 24 జతల వృషభాలు పాల్గొన్నగా హోరాహోరీగా జరిగిన పోటీల్లో ఎమ్మిగనూరు మండలం గుడికల్ రైతు నల్లయ్య వృషభాలు మొదటి బహుమతి రూ.20,116 గెలుచుకున్నాయి. రెండవ బహుమతి వైఎస్సార్ జిల్లా గాజుల పేట మండలం వేంపల్లి రైతు పసులేటి రమణయ్య ఎద్దు రూ.15,116, మూడవ బహుమతి పత్తికొండ మండలం పులికొండ రైతు రంగస్వామి ఎద్దులు రూ. 10,116 గెలుచుకున్నారు. విజేత ఎద్దుల యజమానులకు వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజక వర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి, సర్పంచ్ శ్రీలత బహుమతులను అందజేశారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

ఆలూరు రూరల్: రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విరుపాక్షి శనివారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆలూరుకు చెందిన రసూల్, నరసింహ, విజయ్ పంజాబ్‌లో జరిగే క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.

నవరత్నాలతో రాష్ట్రంలో నవశకం



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో నవశకం వచ్చిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని పోతుగల్లు గ్రామంలో శనివారం ఆమె సీసీ రహదారి ఏర్పాటుకు భూమి పూజ చేశారు. జగనన్న ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కొక్కటిగా నెరవేర్చారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పథకాలు రావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. జగనన్న పాలనలో అర్హత ఉంటే పార్టీలకు అతీతంగా ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పార్టీ జిల్లా మహిళా కార్యదర్శి రాములమ్మ కుమారుని వివాహంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి, ఎంపీపీ వెంకటరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు, సర్పంచ్ తెలుగు వాణిశ్రీ, నాయకులు సుబ్బారెడ్డి, వెంకటేష్, జులుపాల మద్దిలేటి, నారాయణరెడ్డి, చిన్న మద్ది, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడమే ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక



బోరుకు పూజలు చేస్తున్న బుట్టా రేణుక

నందవరం: గ్రామాల్లో ప్రజల దాహార్తి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక అన్నారు. శనివారం మండల పరిధిలోని గురజాల గ్రామంలో సర్పంచ్ వీరస్వామి ఆధ్వర్యంలో పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును బుట్టా రేణుక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సమీపిస్తుండటంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుస్తూ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. నీటి పంపులు, బోరు బావులు, తాగు నీటి పైపులైన్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. కార్యక్రమంలో ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివనీలకంఠప్ప, పరమేష్, నరసింహులు, హనుమంతు, వెంకటేష్, భీముడు, కేశన్న, నాగేష్, కే. రామలింగప్ప, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు



శివపార్వతుల విగ్రహాల ఊరేగిస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం స్థానిక భీమలింగేశ్వర ఆలయంలో అర్చకులు శివరుద్రయ్య స్వామి, మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున పంచామృతాభిషేకం, బిల్వార్చన, మహా మంగళ హారతి తదితర పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల విగ్రహ మూర్తులను వాహనంపై ఉంచి గ్రామ పురవీధులు గుండా ఊరేగించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా భక్తులు భీమలింగేశ్వర ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

హత్తిబెళగల్‌లో..

ఆలూరు: మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు ప్రాణేచిఆచార్ ఆధ్వర్యంలో పంత వెంకన్న ఆంజనేయ స్వామిని మంత్రాలయం రాఘవేంద్రస్వామి నుంచి పంపిన పట్టు వస్త్రాలతో అలంకరించారు. అంతకుముందు స్వామివారికి ఫల, పుష్ప, పంచామృతాభిషేకాలు, హోమాలు, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు.

రామతీర్థంలో..

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయిత్రీ మాత ఆలయంలో శనివారం మాఘ పౌర్ణమి పూజలు నిర్వహించారు. నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు నిర్వహించారు.


రమణీయం.. చెన్నకేశవుడి రథోత్సవం



భక్తుల మధ్య ముందుకు కదులుతున్న రథం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో వెలిసిన చెన్నకేశవస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం రమణీయంగా సాగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. వేడుకల్లో వైఎస్సార్‌సీపీ ఆలూరు సమన్వయకర్త బి.విరూపాక్షి, పార్టీ సీనియర్ నాయకులు తెర్నెకల్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా భక్తులకు వైఎస్సార్‌సీపీ కప్పట్రాళ్ల గ్రామ నాయకులు ట్రాక్టర్లతో తాగునీటిని సరఫరా చేశారు.

బుట్టా రేణుకను భారీ మెజారిటీతో గెలిపిద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



సమావేశంలో పాల్గొన్న గోనెగండ్ల మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అభ్యర్థి బుట్టా రేణుకను అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని కుర్ని కళ్యాణ మండపంలో గోనెగండ్ల మండల ప్రజాప్రతినిధు లు, పార్టీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లను పార్టీ సమన్వయకర్త బుట్టా రేణుకకు ఆయన పరిచయం చేశారు. అంతకుముందు నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీలకు కేటాయిస్తున్నట్లు సీఎం జగన్ పేర్కొనడంతో అందుకు తాము అంగీకరించామ న్నారు. ఆమె విజయానికి తాము కృషి చేస్తామన్నారు.

సమష్టిగా పనిచేద్దాం

నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయానికి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో సమష్టిగా కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక సూచించారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటు వేయాలని అడుగుదామన్నారు. చంద్రబాబు హయాంలో పడిన ఇబ్బందులను, జగనన్న పాలనలో జరిగిన మంచి వివరించి పారదర్శక పాలనకు మరోసారి పట్టం కట్టాలని ప్రజలను కోరుదామన్నారు. సమావేశంలో బుట్టా రేణుక భర్త బుట్టా నీలకంఠప్ప, కుమారుడు ప్రత్యుల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, గోనెగండ్ల ఎంపీపీ నసురుద్దీన్, ఎమ్మిగనూరు, గోనెగండ్ల మండలాల కన్వీనర్లు బీఆర్ బసిరెడ్డి, దొరబాబు నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, యూత్ నాయకుడు బందెనవాజ్, మార్కెట్ యార్డ్ మాజీ ఉపాధ్యక్షుడు మన్సూర్, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాపోరు’కు స్పందన కరువు

పత్తికొండ రూరల్: ఆంధ్రాలో ఒకసారి..కేంద్రంలో మరోసారి నినాదంతో బీజేపీ చేపట్టిన ప్రజాపోరు యాత్రకు ప్రజల నుంచి స్పందన కరువైంది. శనివారం పత్తికొండలోని ప్రధాన కూడలి నాలుగు స్తంభాల వద్ద పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంజిత్ కర్ణి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు వివరిస్తూ, రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ గొంతుచించుకుని గంట పాటు ప్రసంగించినా ప్రజలెవరూ పట్టించుకోలేదు. ప్రచార వాహనంపై పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంజిత్ కర్ణితో పాటు ఒకరిద్దరు మినహా వారి మాటలు వినే జనమే కనిపించలేదు. దీంతో చేసేదేమీ లేక నిరాశతో వాహనాన్ని ముందుకు కదిలిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

చదువుల రామయ్యకు నివాళి

వెల్దుర్తి(కృష్ణగిరి)/ఎమ్మిగనూరు టౌన్/ఆస్పరి: సీపీఐ నేత, కామ్రేడ్ చదువుల రామయ్య వర్ధంతిని ఆ పార్టీ నాయకులు వెల్దుర్తి, ఎమ్మిగనూరు, ఆస్పరిలో శనివారం నిర్వహించారు. రామయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రూప్ - 2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఎమ్మిగనూరు టౌన్: గ్రూప్ -2 పరీక్షలకు కేటాయించిన 16 కేంద్రాల్లో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షకు స్థానిక బాలికల జెడ్పీ హైస్కూల్‌తో పాటు నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, సిద్దార్థ, వైష్ణవి డిగ్రీ కళాశాల, నలంద జూనియర్ కళాశాల, భాష్యం హైస్కూల్, ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీచైతన్య హైస్కూల్, రావూస్ డిగ్రీ కళాశాల, మాచాని సోమప్ప ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, వీవర్స్ కాలనీ హైస్కూల్, జీఎంఆర్ బీఈడీ కాలేజీ, మదర్ థెరిస్సా బీఈడీ కళాశాల, నలంద డిగ్రీ కళాశాల, నలంద బీఈడీ కళాశాలలను కేంద్రాలుగా నిర్ణయించారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో 4,411 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు అధికారులు తెలిపారు.

వైభవంగా తాత లాలూస్వామి ఉరుసు



లాలూస్వామి సమాధిపై ఫాతెహాలు కప్పి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో తాత లాలూస్వామి ఉరుసును శనివారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున గంధంను అశ్వంపై తీసుకువచ్చి స్వామికి సమర్పించారు. కులమతాలకు అతీతంగా భక్తులు దర్గాకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా గ్రామంలో ఎగ్జిబిషన్, స్వీట్, గాజుల అంగళ్లతో కళకళలాడుతోంది.

నేడు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

ఉరుసు సందర్భంగా ఆదివారం రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తాత ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటల్లోపు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలను అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9652025099, 7702630416, 9989028249 నంబర్లను సంప్రదించాలన్నారు.

చరిత్రను భావితరాలకు అందించాలి

మద్దికెర: మన ప్రాంత చరిత్ర భావితరాలకు అందించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కసాపురం లక్ష్మి నారాయణస్వామి ఆలయం (టీపీఆర్) ట్రస్టు చైర్మన్ తలారి పరశురాముడు, శకుంతల అన్నారు. శనివారం మద్దికెర, కసాపురం, చిప్పగిరి, కొనకొండ్ల తదితర ప్రాంతాల పురాతన చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. ముందుగా మద్దమాంబ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్రకు సంబంధించి 50 వేల పుస్తకాలను ముద్రించి గ్రామాల్లో పంపిణీ చేస్తూ, ఆధ్యాత్మిక భావాలు, దైవ భక్తి, తల్లిదండ్రులు పట్ల ప్రేమ గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

బ్రహ్మగుండం ట్రస్టు బోర్డు సభ్యుల నియామకం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ సమీపంలోని ప్రముఖ శైవక్షేత్రం బ్రహ్మగుండం దేవస్థానం నూతన ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఇటీవల దేవదాయ శాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ ఉత్తర్వులు విడుదల చేశారు. నాలుగేళ్లుగా దాతలు, ప్రభుత్వం సహాయంతో దాదాపు రూ.అరకోటితో బ్రహ్మగుండం క్షేత్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న, భక్తులకు సౌకర్యాలను మెరుగు పరిచిన మండలినే ఈ దఫా సైతం మరో రెండేళ్లపాటు కొనసాగించనున్నారు. నూతన ధర్మకర్తల మండలిలో పాత సభ్యులే అయిన బొమ్మన పెద్దిరెడ్డి, సి.సత్యనారాయణ, వి.వెంకట రమణమ్మ, బి.సుజాత, కె.పుల్లమ్మ, వి.శివమ్మ, ఎమ్.మధు, ఎక్స్‌అఫీషియో మెంబరుగా ఆలయ ప్రధాన అర్చకులు టి శివకుమార్ ఉన్నారు. వీరిలో చైర్మన్‌గా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆశీస్సులతో బొమ్మన పెద్దిరెడ్డి నియామకం మరోసారి ఖాయమైంది. త్వరలో మండలి ప్రమాణ స్వీకారం జరుగనున్నట్లు సమాచారం.

కలిసి కట్టుగా పనిచేద్దాం

హొళగుంద: రాబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని పార్టీ మండల కన్వీనర్ షఫివుల్లా కార్యకర్తలకు సూచించారు. శనివారం ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి ఆదివారం వందవాగిలి, గజ్జహళ్లి గ్రామాల్లో పర్యటించనున్నారని, ప్రజాప్రతినిధులు నాయకులు హాజరుకావాలన్నారు.

ఘనంగా బసవేశ్వరస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

హాలహర్వి: మండలంలోని బాపురం గ్రామంలో బసవేశ్వరస్వామి రథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం స్వామివారి రథాన్ని ఆలయం నుంచి భక్తుల హర్షధ్వానాల మధ్య ముందుకు లాగారు. వేడుకల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి పాల్గొని పూజలు నిర్వహించుకున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు
70750 09147 (ఎమ్మిగనూరు),
97054 44304 (ఆలూరు, పత్తికొండ)
Office mail : sakshiknladvt@gmail.com